# దీర్ఘకాల పెట్టుబడిదారులకు మంచి అవకాశం



గత కొంత కాలంగా స్టాక్ మార్కెట్‌ను దుర్వార్తలు వెంటాడుతున్నాయి. ఒక దాని వెంట మరొకటిగా వస్తున్న చెడు వార్తలతో మదుపుదార్ల విశ్వాసం దెబ్బతింటోంది. అధిక ద్రవ్యోల్బణం, అధిక వడ్డీరేట్లు, అధిక చమురు ధర వీటిలో ముఖ్యమైనవి. దీనికి తోడు ఎస్‌బీఐ ప్రకటించిన నిరుత్సాహకర నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో మార్కెట్ సెంటిమెంట్ ఇంకా బలహీనపడింది. ఇన్ఫోసిస్ ఫలితాలు సైతం పెద్ద ఆకర్షణీయంగా లేవు. దీనికి తోడు ఒక ప్రముఖ విదేశీ సంస్థ, ఇంకా 10 శాతం 'దిద్దుబాటు' ఉందని, నిఫ్టీ 4800 పాయింట్లకు పతనం కావచ్చని అంచనా కట్టింది. మార్కెట్ సూచీలు దీర్ఘ కాలంగా 200 రోజుల చలన సగటు (డీఎంఏ)కు దిగువనే ట్రేడ్ అవుతున్నాయని, దీనిని బేర్ మార్కెట్‌కు సంకేతంగా పరిగణించాలనేది మరొక విశ్లేషణ. దాదాపు ఇప్పటికే మదుపుదార్లందరిలో ఇదే నీరసం, నిరుత్సాహం. బ్రోకరేజీ సంస్థలను చూస్తే ఎక్కడా హుషారు కనిపించడం లేదు.. ఆశావహమైన వాతావరణ సూచనలు లేవు.

మరో వైపు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన మధ్యతరగతి ప్రజానీకం కొనుగోలు శక్తి ఎలా ఉందో తెలుసుకోవడానికి నాకెదురైన ఒక అనుభవాన్ని వివరిస్తాను. ఈ మధ్య నేను హైదరాబాద్ లోని ఐటీ సంస్థల కేంద్రమైన మాదాపూర్‌లోని ఒక భారీ షాపింగ్ మాల్‌కు వెళ్లాను. ఆశ్చర్యకరంగా అక్కడ ఫుడ్ కోర్టులు, సినిమా థియేటర్లు, షాపింగ్ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో మన దేశ ఆర్థిక సామర్థ్యంపై నాలో ఎంతో విశ్వాసం. ఇండియా ఆర్థికంగా ప్రబల శక్తి అవుతుందన్న భరోసాను కలిగించే విషయం ఇది.

స్టాక్ మార్కెట్ ఎంత నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ నిఫ్టీ 5200- 5300 పాయింట్ల కన్నా కిందకు జారకపోవడం గమనించదగ్గది. అంటే, 'కాంట్రేరియన్ ఇన్వెస్టర్లు' చాప కింద నీరులా నాణ్యమైన షేర్లను కొంటూ ఉండి ఉండాలి. అందుకే దిగువ స్థాయిలో ఈ బలమైన మద్దతు. ఇక విలువ ప్రకారం చూస్తే మార్కెట్ ప్రస్తుతం 25 శాతం డిస్కౌంట్‌లో ట్రేడ్ అవుతోంది. విలువ-ప్రవర్తన సిద్ధాంతం ప్రకారం చూస్తే, దీర్ఘ కాలిక మదుపుదారులకు ఇప్పుడు మంచి పెట్టుబడి అవకాశం ఉందనిపిస్తోంది. ఇటువంటి క్రియాశీల తరుణంలో సమయోచిత నిర్ణయం తీసుకోవడం అవసరం. అటువంటి వారికే మార్కెట్ కలిసి వస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**– పి.జయప్రకాశ్, డైరెక్టర్, ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్**